# కర్నూలు | నంద్యాల వార్త

20 డిసెంబర్ , 2024 శుక్రవారం పేజీలు 4


## రైతుల భూ సమస్యలను.. నిర్లక్ష్యం చేయకుండ పరిష్కరించాలి




**ప్యాపిలి డిసెంబరు19 ప్రభాతవార్త:** గ్రామాలలో రైతుల భూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండ పరిష్కరించాలని నంద్యాల జిల్లా కలెక్టరు జి.రాజకుమారి ఆదేశించారు. మండల పరిధిలోని బూరుగల గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ రైతులకు చెందిన భూముల వివాదాలు, సమస్యలను పరిష్కరించడం కోసమే గ్రామాలలో రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో రైతులు తమ సమస్యలపై ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించే విధంగా రెవెన్యూ సిబ్బంది పని చేయాలని సూచించారు. భూముల సమస్యల పరిష్కారం కోసమే నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ వివాదాలను పరిష్కరించకుండ విధులలో నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ రైతుల వద్దకే ప్రభుత్వ అధికారులు వచ్చి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని కోరారు. సదస్సులలో భూ సమస్యలను పరిష్కరించడంకూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సులలో టిడిపి నాయకులు పాల్గొని రైతులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టరు బోయవాండ్లపల్లిగ్రామంలో బోయవాళ్ల గృహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, తాహసిల్దార్ భారతి, ఎమ్పిడివో శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా సాగునీటి సంఘ అధ్యక్షుని
## ఎంపిక అధినేత నిర్ణయమే శిరోధార్యం

**- టిడిపి జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి**

**కర్నూలు విద్య, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** జిల్లా సాగునీటి సంఘం అధ్యక్షుని ఎంపిక అధినేత నిర్ణయమే శిరోధార్యమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పి తిక్కారెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం పి తిక్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, పార్టీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జీలు వీరభద్ర గౌడ్, ఎన్ రాఘవేంద్రారెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన టిసి, డిసి సభ్యులను సమావేశంలో అభినందించారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ మద్దతుదారుల గెలుపుకు కృషిచేసిన ప్రతిఒక్కరికి కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. 21న జరగనున్న సాగునీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపికపై సమావేశంలో చర్చించడం జరిగిందని నియోజకవర్గాల వారిగా సూచించిన పేర్లను పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అధినేత నిర్ణయమే శిరోధార్యమని నాయకులు తమ తమ అభిప్రాయాలు తెలియజేస్తు ఒక తీర్మాణం చేసి పంపడం జరిగిందన్నారు.



# కఠిన చర్యలకు..కిక్కెక్కిందా..!



- బొమ్మాలి నిన్ను వదలా అంటున్న బెల్టు షాపులు
- తూటాల పేలుతున్న సీఎం మాటలు..
- బెల్టు షాపుల కట్టడి పోలీసులదా లేక ఎక్సైజ్ పోలీసులదా..!

**కఠిన చర్యలు అనే పదానికి కిక్కెక్కిందా..** అవుననే అనిపిస్తుంది. సీఎం మాటల్లో కఠిన చర్యలు అనే పదం తూటాల్లా పేలుతున్నాయి. బొమ్మాలి నిన్ను వదలా అంటూ బెల్టు షాపులు నీడలా వెంటాడుతున్నా కఠిన చర్యలు అనే మాటకు మత్తు ఎక్కువైందా. గ్రామాలలో బెల్ట్ షాపులు తాగుతూ.. ఊగుతూ.. చెలరేగిపోతున్నాయి. సాక్షాత్తు రాష్ట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో మాట్లాడుతూ.. బెల్టు షాపులు నిర్వహిస్తే జరిమానాలు అంటున్నారు, లైసెన్సులు రద్దు అని కూడా అంటున్నారు. కానీ ఇవేమీ అమలు కావడం లేదు. మరి సీఎం మాటలు ఆరంభ సూరత్వమేనా..! ఎందుకంటే సీఎం స్థాయి వ్యక్తి అసెంబ్లీలో బహిరంగ ప్రకటనలు ప్రకటిస్తూ హెచ్చరిస్తున్నా.. బెల్టు షాపులకు అడ్డుకట్ట పడకపోవడంలో ఎవరి నిర్లక్షం..! **వీటిని అదుపు చేసే బాధ్యత పోలీసులదా..? లేక ఎక్సైజ్ పోలీసులదా..? లేదా అధికారం ముసుగులో బెల్ట్ షాపులు నడుస్తున్నట్లేనా..!**



**మిడుతూరు డిసెంబరు 19 ప్రభాతవార్త:** మండలంలో మిడుతూరు, కడు మూరు గ్రామాలలో రెండు వైన్ షాపులు ఉన్నాయి. గతంలో కూడా ఈ గ్రామాలలో వైన్ షాపులు కొనసాగాయి. అయితే గత వైకాపా ప్రభుత్వ హాయంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పాత పద్ధతి ద్వారా లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించారు. దీంతో స్వేచ్ఛ పెరిగినట్లు అయింది. గ్రామాలలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గ్రామాలలో ఒకరు లేదా ఇద్దరు రహస్యంగా బెల్టు షాపులు గతంలో నిర్వహించేవారు. కానీ ఇప్పుడు కొన్ని గ్రామాలలో ఒకటి రెండింటికి మించి తొమ్మిది బెల్ట్ షాపుల వరకు నడుస్తున్నాయంటే గ్రామాలలో మద్యం ఏ మేరకు తూగుతుందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల బెల్ట్ షాపులు ముమ్మరంగా కొనసాగు తున్నాయని సమాచారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి పోవడంతో బెల్ట్ షాపులు నిర్వహణపై ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశాడు. చేస్తున్నాడు. కానీ షాపుల నిర్వహణ యదేచ్ఛగా కొనసాగుతుందనేది నగ్నసత్యం. స్థానిక పోలీసులు అడపాదడపా దాడులు నిర్వహిస్తూ అప్పుడప్పుడు కేసు నమోదు చేస్తున్న అంతకంతకు గ్రామాలలో బెల్ట్ షాపులు మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి.

ఈ షాపులు నిర్వహించాలంటే అక్కడక్కడ డబ్బు...


• వివరాలు 2లో


## భూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

**- జెసి నవ్య**

**- ఎస్.బోయినపల్లిలో రెవెన్యూ సదస్సు..**

**వెల్దుర్తి,డిసెంబర్19,ప్రభాతవార్త** భూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. మండలంలోని ఎస్.బోయినపల్లి గ్రామంలో గురువారం మండల తహశీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామపెద్దలు నర్సింగ్ కాంతారెడ్డితో పాటు రెవెన్యూ అధికారులు,గ్రామ రైతులు,ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలోని రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామన్నారు. సాగులో ఉన్న పట్టా పొలం నంబర్ కాకుండా ప్రక్క పొలం నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సదస్సులో ఓ రైతు తెలపగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి సవరణ చేయించుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు నర్సింగ్ కాంతారెడ్డి,మండల తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, సర్వేయర్ హేమంత్‌రెడ్డి,విఆర్వోలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.





# పైసలిస్తేనే.. సర్వే..!?

- కొందరు సర్వేయర్ల ఇష్టారాజ్యం
- సర్వే కోసం కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు
- చలానా కట్టినా తప్పని ఇక్కట్లు
- రాజకీయ నేతల పనులు చక్కబెడుతున్న సర్వేయర్లు
- ప్రైవేట్ సర్వేయర్,తలారి మధ్య ఘర్షణ
- ఆరోపణలున్న సర్వేయర్లను బదిలీ చేయాలంటున్న రైతులు


• వివరాలు 2లో


**అది పంట పొలమైనా, కమర్షియల్ భూమైనా.. సర్వే చేయాలంటే ముడుపులు చెల్లించాల్సిందే..? పైసలిస్తేనే కొలతలెంతో తేలుతాయి..? లేకపోతే సర్వేయర్లు ఆ పరిసరాల్లో కూడ అడుగుపెట్టరు..? ఆస్తిని సర్వే చేయించుకొవడానికి ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తోంది. కొంత మంది చోటా నాయకులకు మాత్రం పని సులువుగా అయిపోతుందని సమాచారం. సాదారణ జనాలకు మాత్రం నెలలు వేచి ఉన్నా పట్టించుకునే దిక్కులేకుండా పోతుది.**

**ఎమ్మిగనూరు క్రైం, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలోని, వివిధ గ్రామాల్లో భూముల సర్వేకు ఎక్కువ డిమాండ్ ఉంది. కాకపోతే ఇక్కడ ఉన్న సర్వేయర్లు మామూళ్ల కు అలవాటు పడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో సర్వేయర్లు భూములను సర్వే చేయకపోవడంతో కొన్ని భూ వివాదాలు కోర్టుల వరకు వెళ్లిన సంఘటనలు కూడ చోటు చేసుకున్నాయి. ఏది ఏమైనా సర్వే కోసం చలానా కట్టిన బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నారే తప్ప సర్వే చేసేందుకు మాత్రం సర్వేయర్లు ముందుకు రావడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకుల పనులు మాత్రం ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వారి పనులు చక్కబెట్టడమే కాకుండా రెవిన్యూ కార్యాలయంకు వస్తే రెవిన్యూ అధికారులు కుర్చీలో కూర్చోపెట్టి వారితో గంటలు తరబడి మంతనాలు చేస్తూ బేరసారాలు కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

# పదవ తరగతిలో.. ఉత్తీర్ణత పెరగాలి

**: ఈ మూడు నెలలు ఉపాధ్యాయులకు సాధారణ సెలవులు ఉండవు**

**: 15 రోజుల్లోపు వర్చువల్ తరగతులు ప్రారంభం : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, డిసెంబరు19, ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ప్రతి విద్యార్థి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి నోటికి నూరు శాతం రిజల్ట్స్ తో ముందు ఉండాలని కలెక్టర్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షల ఉత్తీర్ణతా శాతం పెంపుపై ఎంఈఓలు, ప్రధాన ఉపాధ్యాయులు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ వసతి గృహాల వార్డెన్స్ తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా గత సంవత్సరం తక్కువ పర్సంటేజ్ వచ్చిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎం ఈ వో లతో మాట్లాడారు.. గత సంవత్సరం ఎందుకు తక్కువ పర్సంటేజ్ వచ్చింది, ఈ ఏడాది పాస్ పర్సంటేజ్ పెంపునకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు అని కలెక్టర్ లోతుగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ మూడు నెలలు పదవ తరగతి పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు ఉపాధ్యాయులకు మెడికల్ ఎమర్జెన్సీ, జెన్యూన్ రీజన్ ఉంటే తప్ప దీర్ఘకాలిక సెలవులు మంజూరు చేయకూడదని కలెక్టర్ హెడ్ మాస్టర్ లను ఆదేశించారు.. వ్యక్తిగత,ప్రైవేట్ అఫైర్స్ మీద సెలవు మంజూరు చేసి ఉంటే వారి సెలవులు రద్దు చేసి వెనక్కి పిలిపించాలని కలెక్టర్ డీఈవో ను ఆదేశించారు.. కొంతమంది విద్యార్థుల భవిష్యత్తు ఈ పరీక్షల మీద ఆధారపడి ఉందని ఉపాధ్యాయులు గుర్తు పెట్టుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.. ముఖ్యంగా విద్యార్థి ఏమి చదివితే పరీక్షలో పాస్ అవ్వగలడు అనే అనే అంశం మీద దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఆ మేరకు పరీక్షల్లో వస్తాయి అనుకునే ముఖ్యమైన ప్రశ్నలు తయారు చేసి వాటిని నేర్పించి, వాటిపై తరచు పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు.. అలా తరచు విద్యార్థి పరీక్షలు రాయడం వల్ల సబ్జెక్టు లో పట్టు వచ్చే అవకాశం తో పాటు పరీక్షలంటే భయం తొలగిపోతుందని కలెక్టర్ సూచించారు. నేడు సాంకేతికత అందుబాటులో ఉన్న నేపథ్యంలో యూట్యూబ్ ద్వారా కూడా పాఠాలు కూడా వారికి బోధించేలా చూడాలన్నారు. ఇప్పటికే మెటీరియల్ నోట్స్ ఇచ్చామని అవసరమైతే స్పెషల్ మెటీరియల్ కూడా తయారు చేసి విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన టీచర్స్ బెస్ట్ ప్రాక్టీసెస్ కూడా రికార్డ్ చేస్తామని కలెక్టర్ తెలిపారు .. 15 రోజుల్లోపు వర్చువల్ తరగతుల ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. విద్యా వాలంటీర్లకు నియామకానికి సంబంధించి కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.. కొన్ని పాఠశాలల్లో 2023 24వ సంవత్సరంలో తక్కువ పాస్ పర్సంటేజ్ రావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వచ్చే సంవత్సరంలో ఈ విధమైన పరిస్థితి రాకూడదని కలెక్టర్ డిఈఓను, పాఠశాలల ప్రధానో పాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఢిల్లీలో జరిగిన 68వ జాతీయ స్థాయి కరాటే అండర్ 17 బాలుర భాగంలో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు వెంకట శ్రీ దినేష్ స్వర్ణ పతకం, అండర్ 14 బాలుర విభాగంలో కంచి హవీష్, హేమంత్ కుమార్ రెడ్డి వెండి పథకాలు, బాలికల విభాగంలో కురిమెట్ల యశ్మిత, గోపగ్న వెండి పథకాలు సాధించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఈఓ శామ్యూల్ పాల్, బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, డిసిఓ శ్రీదేవి, అసిస్టెంట్ కమీషనర్ చంద్రభూషణం, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఇబ్బందులు..!

- రోడ్డు పైనే కూరగాయలు పండ్ల విక్రయాలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- డైలీ మార్కెట్ ఉన్నా కూడా ఉపయోగించుకోని వ్యాపారస్థులు



**ఆలూరు రూరల్, డిసెంబర్19, ప్రభాతవార్త:** ఆలూరు పట్టణంలో పాతబస్టాండ్‌లో ఇటు కూరగాయలు మరియు పండ్లు అమ్మే వ్యాపారస్థులు రోడ్డుకు అడ్డదిడ్డంగా వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ఇటు వాహనదారులకు మరియు విదా ్యర్థులకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రాంతం గుండా వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా కూరగాయలు డైలీ మార్కెట్‌లో కాకుండా నడి రోడ్డు పై వ్యాపారం నిర్వహిస్తుండ డంతో ద్విచక్రవాహనదారు లకు, బస్సులకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని పలువురు ప్రజలు ఆరోపిస్తు న్నారు. అయితే ప్రయాణికులు వ్యాపారసు ్థలను రోడ్డుకు అడ్డంగా ఉన్నందున్న వాటిని తీయాలని కోరితే వారి పై దాడులకు కూడా వెనుకాడటం లేదు. కూరగాయలు మరియు పండ్ల వా ్యపారస్థులు షాప్‌ల ఎదుట నిలుపుతుండడంతో మా షాప్‌లకు దారి లేకుండా పోతుందని షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు తెలుపుతున్నారు. పంచా యతీ అధికారులు, పోలీస్ సిబ్బంది స్పందించి ఈ సమస్యను పరిష్కరించా లని షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు కోరుతున్నారు. అయితే సంత మార్కెట్‌లో లక్షలు వెచ్చించి షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారని వాటికి కూడా టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికి షాప్‌లు దక్కించుకున్న వారికి ఇప్పటి వరకు షాప్‌లు అప్పగించకపోవడంతో వాటిల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని వ్యాపారస్థులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షాప్‌లను శుభ్రం చేయించి టెండర్ దక్కించుకున్న వారికి అప్పగించా లని కోరుతున్నారు. అలాగే బస్టాండ్‌లో ఉన్నటువంటి వారిని సంతమార్కెట్‌కు పంపించాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.





## వార్తా ప్రభావం..!
## తహశీల్దార్‌పై సబ్ కలెక్టర్ ఆగ్రహం..!

**- భూ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం ఎందుకని నిలదీత..**

**- భూ సమస్యలు పేరుకుపోవడం పట్ల అసంతృప్తి**



**పెద్దకడుబూరు,డిసెంబరు 19,ప్రభాతవార్త** పెద్దకడుబూరు మండల తహశీల్దార్ శ్రీనాథ్‌పై ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కార్యాలయంలో భూ సమస్యలు పేరుకుపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీన మాకొద్దు బాబోయ్ తహశీల్దార్.. పేరుకుపోయిన భూ సమస్యలు..అనే శీర్షిక వార్త దినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించిన సబ్ కలెక్టర్ తహశీల్దార్‌తో పాటు విఆర్‌ఓలు,సర్వేయర్లు తదితర రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి భూ సమస్యలపై ఆరాతీశారు. గత రెవెన్యూ సదస్సులో 1700అర్జీలు రాగా కేవలం 200అర్జీలు మాత్రమే పరిష్కరించడంతో తహశీల్దార్‌తో పాటు సిబ్బందిపై సబ్ కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. భూ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని,సిబ్బంది కొరత ఉంటే మరికొంతమంది సిబ్బందిని తెప్పించుకోవాలని అంతేకానీ సమస్యలు పరిష్కరించకుండ రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పించు కోవడం బాగుండదని ఇకనుండైనా వేగంగా భూ సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కార్యాలయంలో పనిచేసే ప్రతిఒక్కరు చిత్తశుద్ధి,అంకితభావంతో పనిచేయాలని అప్పుడే రెవెన్యూ శాఖపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. రెండో విడత గ్రామసభలు ముగిసేలోపు మొదటి విడత గ్రామసభలో వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల విఆర్‌ఓలు,సర్వేయర్లు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పగిడిరాయికి ఎమ్మెల్యే రాక

**తుగ్గలి, డిసెంబరు 19,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పగిడిరాయి గ్రామానికి నేడు పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాంకుమార్ వస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్‌నాయుడు తెలిపారు. పగిడిరాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించడం జరుగుతుందన్నారు. కావున మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు,సర్పంచ్‌లు,మాజీ సర్పంచ్‌లతో పాటు టిడిపి పార్టీ,కెఈ కుటుంబం అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# పైసలిస్తేనే..సర్వే..!?

(మొదటి పేజీ తరువాయి ) :

భూ యజమాని సర్వే కోసం ముందుగా మీసేవ కేంద్రంలో రుసుము చెల్లించి చలానా తీసుకోవాలి. ఆ చలానాను తహశీల్దార్ కార్యాలయంలో అందచేయాల్సి ఉంది. ఆ కార్యాలయ అధికారి మండల, గ్రామ సర్వేయర్లకు సర్వే చేయమని చలానాను పంపిస్తారు. మండల సర్వేయర్ అయితే చలానా కట్టిన 30 రోజుల్లో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాల్సి ఉంటుంది. కొందరు స్థలాన్ని బట్టి సర్వేకి రావడానికి ముందుగానే తమవద్దనున్న తలారుల ద్వారా అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న వార్తలు కూడ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎమ్మిగనూరు, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న భూములు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడిప్పుడే ఎమ్మిగనూరు అభివృద్ధి కావడంతో భూములు కోనుగోలు దారులు కూడ ఎక్కువైయ్యారు. దీన్ని ఆసరాగా చేసుకొని సర్వేకి వస్తున్న భాదితుల వద్ద నుంచి అధిక మొత్తంలో వసూల్ చేస్తున్నారనే ఆరోపణలు సర్వేయర్లపై ఉన్నాయి. ఇటీవల ఓ వ్యక్తి సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న పోలం యజమాని నుండి సర్వేయర్ వేల రూపాయలు ముట్టచెబితే గాని సర్వే చేసి హద్దులు నిర్ణయించనని చెప్పినట్లు స్థల యాజమాని వాపోయారు. ఇలా ఎమ్మిగనూరులో ఓ సర్వేయర్ కోట్లకు పడగలెత్తిన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. సర్వేయర్ అడుగు బయటపెట్టాలంటే ముందుగానే ముడుపులు చెల్లిస్తేనే కాలు బయటపెట్టే పరిస్థితి లేదని బాధితులు తెలుపుతున్నారు. ఎవరైనా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేస్తే వారి భూములు సర్వేకి నెలలు, సంవత్సరాలు పొడుగు ఆగాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రియల్టర్లు సర్వేయర్లకు ఇయ్యాల్సిన ముడుపులు ముట్టచెప్పి చెక చెకా వెంచర్లు వేసుకొని వారి పనులు చక్కపెట్టుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**- స్థలాన్ని బట్టి ముడుపులా..?**

ఎమ్మిగనూరు పట్టణంలోనే కాకుండా మండల పరిధిలోని గ్రామాల్లో భూముల ధరలు అధికంగా ఉన్నాయి. అయితే ఈ వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వాటిని వ్యవసాయేతర భూములుగా మార్చేశారు. మండలాల సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు ఏమాత్రం విధులు నిర్వహించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. వ్యాపార సంస్థలు, రియల్టర్లు ప్లాట్లు వేయడానికి భూములు సర్వే చేయించడం కోసం సర్వేయర్లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. దీన్ని బట్టి స్థలం విలువ వారి డిమాండ్‌ను బట్టి సర్వేయర్ల ఆయా భూముల సర్వేకి రేటును నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లపై బాధితులు స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికి వారిపై ఏమాత్రం చర్యలు తీసుకోలేక పోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా చలానాలు కట్టి నెలలు గడుస్తున్నా ఏదో ఒక సాకు చూపించి సర్వేకి రావడానికి జాప్యం చేస్తున్నట్లు సమాచారం.

**- ప్రజలను పీక్కుతింటున్నారు..!**

సర్వేయర్లు లంచాల ఊబిలో కూరుకుపోయారనడానికి సర్వేయర్ల కోసం రైతులు సర్వే చేయించుకునేందుకు చెప్పులు ఆరిగేలా తిరుగుతున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం అని తెలుస్తుంది. పరిస్థితి పూర్తిగా చేయిదాటి పోతున్నా..స్థానిక అధికారి వీరి గురించి పట్టించుకోవడం లేదని సమాచారం. కొంతమంది సర్వేయర్లు అనతి కాలంలోనే సంపన్నులుగా మారిపోతున్నా..ఏసిబి అధికారులకు కనిపించడం లేదా..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఏసిబి అధికారులంటే సర్వేయర్లు గజగజ వణికిపోయే వారు ప్రస్తుతం సర్వేయర్లు చేతికి మట్టి అంటకుండా జాగ్రత్తలు పడుతూ నేరుగా ముడుపులు తీసుకొకుండా మధ్యవర్తులైన తలారుల ద్వారా ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. రైతులకు న్యాయం చేయాల్సిన సర్వేయర్లు లంచాలతో ప్రజలను పీక్కుతింటున్నారని ఏసిబి అధికారులు వీరిపై నిఘా ఉంచి సర్వేయర్ల అవినీతికి కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**- కలెక్టర్ గారు ప్రక్షాళన చేయండి..!**

ఎమ్మిగనూరులో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న దీర్ఘకాలికంగా మండలాలలో సర్వేయర్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరినీ బదిలీ చేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటి వరకు ఏళ్ల తరబడి ఆయా సర్వేయర్లే కుర్చీలకు అతుక్కుపోవడంతో వారు చెప్పిందే వేదంగా కొనసాగుతుంది. ముడుపులిస్తేనే సర్వేయర్లు సర్వేకి వస్తారన్నది జగమెరిగిన మాటగా ప్రజలంతా చెబుతున్నారు. ఇప్పటికైనా ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్న సర్వేయర్లతో పాటు రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ ను కూడ బదిలీ చేసి నిజమైన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

**- తలారిపై ప్రైవేటు సర్వేయర్ దాడి..!**

మండల పరిధిలోని టీఎస్ కలువాలలో గ్రామ తలారి మల్లికార్జున స్థలాన్ని ప్రైవేట్ సర్వేయర్ రామాంజనేయులు అనే ప్రైవేట్ సర్వేయర్ తమ పొలం విషయంలో కలుగజేసుకొని అవతల వ్యక్తులతో డబ్బులు తీసుకొని మ్యాప్ ఇవ్వడంకు బేరం కుదుర్చుకున్నాడన్న విషయం తెలుసుకున్న గ్రామ తలారి మల్లికార్జున ప్రైవేట్ సర్వేయర్‌ను ప్రశ్నించాడు. రెవిన్యూ కార్యాలయం ముందే వారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొని దాడికి దారితీసింది. ప్రైవేట్ సర్వేయర్ రామాంజనేయులు గ్రామ తలారి మల్లికార్జునపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామ తలారి మల్లికార్జున్‌కు తెలిపారు.

**- డబ్బులు తీసుకొని తిప్పుకుంటున్నారు..పెద్ద రాముడు**
**( రైతు కలుగొట్ల )**

కలుగొట్ల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ : 507సి లో 20 సెంట్ల తక్కువ స్థలం సర్వే చేసి ఆన్‌లైన్ నందు నా పేరుపై నమోదు చేసేందుకు దాదాపు రెండు సంవత్సరాల క్రితం మధ్యవర్తి అయిన తలారి నుంచి డబ్బులు తీసుకొని వెళ్లిపోయారు. అయితే ఆ రోజు నుంచి ఇప్పటి వరకు సర్వే చెయ్యకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తూ కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో సర్వే కోసం రోజు కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదు. రెవిన్యూ అధికారికి ఫిర్యాదు చేసినా ఎవరూ కూడ స్పందించడం లేదు. దీంతో విసుగు చెంది గత కొన్ని నెలల క్రితం గ్రామ సచివాలయంలో సర్వేయరును గట్టిగా ప్రశ్నిస్తే నాపై దాడి చేసేందుకు కూడ ప్రయత్నించాడు. సర్వేయర్‌కు ఫోన్ చేస్తే నా నెంబర్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం జరిగింది. కేవలం రాజకీయ నాయకులకు మాత్రమే పనులు చక్కబెడుతూ..సామాన్య రైతులను మాత్రం కార్యాలయం చుట్టూ చెప్పులు ఆరిగేలా తిప్పుకుంటున్నాడు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు స్పందించి నాకు చేయాలని కోరుతున్నాను.

## కఠిన చర్యలకు.. కిక్కెక్కిందా..!

(మొదటి పేజీ తరువాయి ) :

డిపాజిట్ చేసుకుంటేనే అనధికార అనుమతులు ఉంటాయని పలువురు అంటున్నారు. గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాల్సి వస్తుందని సీఎం బాబు అంటున్నారు. అంతేకాకుండా ఎమ్మార్పీ ధరకు మించి లేదా బెల్ట్ షాపులు నిర్వహిస్తే లక్ష, 2 లక్షలు, ఐదు లక్షలు, అంతకుమించి మద్యం దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్వహణ లేకపోతే తాము పెట్టిన పెట్టుబడులు అందుకోలేమని మద్యం షాపుల నిర్వాహకుల వాదన. కాగా మరోవైపు షాపులపై హెచ్చరికలు. ఇలా ప్రభుత్వమే ఒక మాట మీద కాకుండా రెండు నాలుకల ధోరణి అవలంబిస్తూ, నాయకత్వంపై ఉన్న నమ్మకం పోయి ప్రజల్లో పలుచని పార్టీకి చెడ్డ పేరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. లేదంటే ప్రజలు ఆలోచనలను, అంచనాలను గుర్తించకుండా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు అయినా జరిగే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగా బెల్ట్ షాపులను అరికట్టేది పోలీసు శాఖన, లేక ఎక్సైజ్ పోలీసు శాఖన. రెండు శాఖలు ఎవరి స్థాయిలో వారు పెద్ద శాఖలే. కానీ బెల్ట్ షాపులను అరికట్టేది ఎవరు? షాపులను అదుపులో పెట్టే దమ్ము ఏ శాఖకు లేదా! ఇప్పటికే కొన్ని గ్రామాలలో కొన్ని సమస్యలు తీవ్ర వేశాయి. మరి ఇప్పుడు అధికార పార్టీలోనే రెండు వర్గాలు బెల్ట్ షాపులు నిర్వహణలో ఇరువురు పోటీపడి చెలరేగి పోతే పరిస్థితి ఎందాక వెళుతుంది. చిన్న సమస్యలైనా పెద్ద సమస్యలైనా ముదిరిపాకనపడి మత్తెక్కుతాయి. ఇలాంటివి ఊహించే పెద్దాయన సీఎం చంద్రబాబు నాయుడు బెల్టు షాపులు నిర్వహణపై అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. హెచ్చరికలు చేస్తున్నారు. కానీ కిందిస్థాయిలో అవి అమలు కావడం లేదు. ప్రశాంతంగా ఉన్న పల్లె సీమలు మత్తులో మునిగి తేలకముందే సంబంధిత అధికారులు బెల్ట్ షాపుల పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. సారాయి బెల్లం పట్టుకున్నాం, సారాయి ఊట ధ్వంసం చేసాం,ఇలా అడపాదడపా.దాడులు జరుగుతున్న, కంటికి ఎదురుగా బెల్ట్ షాపులు నడుస్తున్న ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు ఉన్నాయా లేదా అనేది సంబంధిత అధికారులకు తెలుసు అయినవారు అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ ను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## 38వ వార్డులో వేగవంతంగా అభివృద్ధి పనులు

నంద్యాల హాస్పటల్,డిసెంబర్ 19,ప్రభాతవార్త:

పట్టణంలోని 38వ వార్డు వై.ఎస్.ఆర్.నగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. కాలనీలో నెలకొన్న రోడ్లుచ తాగునీటి సమస్య, వది లైట్లు గురించి స్థానికులు టిడిపి వార్డు ఇన్‌చార్జ్ తాటికొండ బుగ్గరాముడు ద్వారా రాష్ట్ర టిడిపి నాయకుడు ఎన్.ఎం.డి.ఫిరోజ్ దృష్టికి తీసుకెళ్ళడంతో వెంటనే ఆయన స్పంధించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పనులు ప్రారంభించడంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## దాతలు చేస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**నందికొట్కూరు,డిసెంబర్ 19,ప్రభాతవార్త:** పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిషత్తు కోసం దాతలు చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి పి.సుభాన్ తెలిపారు.గురువారం పాఠశాల పూర్వపు విద్యార్థి నాగిరెడ్డి పాఠశాలను సంధర్శించి క్రీడా మైదానమును రూ.50 వేలు వెచ్చించి శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతు మన ఊరు మనబడి అభివృద్ధి చేసుకోవాల్సిన భాధ్యత అందరికి ఉందని, త్వరలో పాఠశాలకు అవసరమైన మౌళిక వసతులను, అలాగే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు డైనింగ్ షెడ్ మరియు సైకిల్ షెడ్డును ఏర్పాఉ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాల కోసం నాగిరెడ్డి చేస్తున్న సేవలను ఎం.ఇ.ఓ. కొనియాడారు. అనంతరం దాతకు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జుబేదా, ఉపాధ్యాయులు రఫీ అహ్మద్, డి.ఈశ్వరయ్య,అల్లిహుశ్శైన్, ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

నందికొట్కూరు,డిసెంబర్ 19,ప్రభాతవార్త:

విద్యాభి వృద్ధికి పెద్దపీఠ వేస్తామన్న కూటమి ప్రభుత్వం విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదని, ప్రశ్న పత్రాల లీకేజిల అంశంపై సమగ్ర విచారణ జరిపి భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్.ఎస్.యు.ఐ,నాయకులు సాయికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ప్రశ్నా పత్రాలు లీకేజీలు మొదలయ్యాయని ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తున్నదన్నారు. విద్యాశాఖలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోష్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు ఆయన డిమాండ్ చేశారు.

## స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని తహాశీల్దార్‌కు వినతి

**కర్నూలు రూరల్, డిసెంబర్ 19, ప్రభాతవార్తః** స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డివై ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర తహాశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. గురువారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సులో డివైఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, మండల నాయకులు అంజి, గ్రామ పెద్దలు కల్లు శివన్న, హనుమంతు, ఇస్మాయిల్,



వెంకటేశ్వర్లు, సురేష్‌లతో కలిసి స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కర్నూలు రూరల్ ఇంచార్జ్ తహాశీల్దార్ వెంకటలక్ష్మిని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత స్రాల కిందట గ్రామంలో సర్వేనం.443లో అప్పటి జనాభాకనుగుణంగా ఎకర భూమి కేటాయించారన్నారు. ఇప్పటి గ్రా మ జనాభాకనుగుణంగా రెండు ఎకరాల స్థలం స్మశానం కోసం కేటాయించాలని శ్మాశానం చుట్టుపక్కల ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తహాశీల్దార్ వెంకటలక్ష్మి స్పందిస్తు త్వరలో గ్రామంలో స్థలాన్ని గుర్తించి స్మశాన వాటిక కోసం ఇస్తామని హామి ఇచ్చారు.

## చిప్పగిరిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

చిప్పగిరి,డిసెంబరు 19,ప్రభాతవార్త

మండల కేంద్రమైన చిప్పగిరిలో సీయోను ప్రార్థన మందిరం ఆద్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సెమీ క్రిస్మస్ వేడుకలు మూడు రోజుల నుండి ముమ్మరంగా సాగుతున్నాయి. దైవ సేవకులు,పాస్టర్ టి జయమ్మ,పాస్టర్ టి రాజుల ఆద్వర్యంలో చిప్పగిరిలో ప్రతి ఇంటింటికి తిరిగి క్రిస్మస్ వేడుకల సందర్భంగా సెమీ క్రిస్మస్ వేడుకలను తెలియజేశారు. ప్రతి ఇంట్లో కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు ప్రభువు పునరుద్దానుడై జన్మించిన జననము గూర్చి బైబిల్ నుండి వివరించి ప్రార్థనలు చేశారు. చిన్నపిల్లలు నాట్యాలతో,పెద్దలు సంగీత వాయిద్యాలతో ప్రతివీధిలో,ప్రతి సందులో యేసుక్రీస్తు సువార్తను ప్రకటించారు. ఈ సెమీ క్రిస్మస్ వేడుకల్లో సంఘ పెద్దలు సంపత్ కుమార్,స్వామిదాసు,జోసెఫ్ విజయ్‌కుమార్,ఇశ్రాయేలు, ఏసేపు,లాజరు, సీమోను, నెహెమ్యా,శ్రీకాంత్,అంజి,మనోహర్,లాబాను,శివతో పాటు ఆత్మ ఫలాలు,చిన్నపిల్లలు,సండే స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటిపై అధికారులతో సమీక్ష సమావేశం

ఆదోని,డిసెంబరు 19,ప్రభాతవార్త

పట్టణంలోని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్,ఎమ్మెల్యే పార్థసారథిలు ఆదోని రూరల్/అర్బన్ ప్రజల తాగునీటిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజా,డిఎల్‌పిఓ నూర్జహాన్,ఎంపిడిఓ రాజేంద్రప్రసాద్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీ పరిపాలన అధికారులతో సమీక్ష సమావేశం

**కర్నూలు రూరల్, డిసెంబర్ 19, ప్రభాతవార్తః** ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా పరిషత్ పరిపాలన అధికారులతో జడ్పీ హాల్ నందు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి నాసరరెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి వెంకటసుబ్బారెడ్డిలు తెలిపారు. సమావేశం నందు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగపురోగతిపై ఎస్సీ, ఎస్టీ, డబ్ల్యుఅండ్‌సిడబ్ల్యు (ఈఎంఎఫ్) నిధుల వినియోగంపై, సమాచార హక్కు చట్టంపై సమీక్ష నిర్వహించామన్నారు. ఈసమావేశం నందు పరిపాలన అధికారులకు తగు సూచనలు జారీచేసినట్లు వారు తెలిపారు.

## రెవిన్యూ సదస్సులు భూసమస్యల పరిష్కారానికి వేదిక

- ఆర్డీఓ సి విశ్వనాథ్

**ఆళ్లగడ్డ, డిసెంబర్ 19, ప్రభాతవార్తః** రెవిన్యూ సదస్సులు భూ సమస్యల పరిష్కారానికి వేదిక అని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మీ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని నంద్యాల రెవిన్యూ డివిజనల్ అధికారి సి విశ్వనాథ్ తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో నంద్యాల రెవిన్యూ డివిజన్ అధికారి సి విశ్వనాద్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ అదేశాల మేరకు ప్రతి గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెఇపారు. భూ సమస్యలు ఉన్నవారు రెవినూ్య సదస్సులో పరిష్కరించుకోవడానికి మంచి అవకాశమన్నారు. అలాగే గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో లోటుపాట్లను రెవిన్యూ సదస్సుల్లో రైతులు ధరఖాస్తు చేసుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. అనంతరం ఆళ్లగడ్డ తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ రెవిన్యూ సదస్సు ద్వారా రైతులు భూ సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం సదస్సుకు వచ్చిన ఆర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు పార్వర్డ్ చేసి రసీదులు అందించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్, ఆర్ఐ, విఆర్‌ఓలు, సర్వేయర్, అన్నిశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడలకు ఎంపికైన గోనెగండ్ల విద్యార్థిని

గోనెగండ్ల డిసెంబరు 19 ప్రభాతవార్త

ఎస్‌జీఎఫ్ అండర్ 19 బెస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో గోనెగండ్ల కస్తూరిబా పాఠశాల విద్యార్థిని గొల్ల రాజేశ్వరి తన ప్రతిభ చాటింది.రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 14 నుంచి 16 వరకు సత్తేనపల్లి లోని లోయర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు.ఈ పోటీలలో కర్నూలు జిల్లాకు చెందిన అండర్ 19 విద్యార్థినిలు పాల్గొన్నారు.అందులో గోనెగండ్లలో కస్తూరిబా స్కూల్ ఇంటర్‌మీడియట్ చదువుతున్న రాజేశ్వరి ఈపోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచి జాతీయ క్రీడాలకు ఎంపికైంది.దీంతో గోనెగండ్ల కస్తూరిబా పాఠశాల ఎస్‌వో విద్యావతి,ఉపాధ్యాయులు,పులువురు,గ్రామస్థులు రాజేశ్వరిని అభినందించారు.జాతీయ క్రీడలలో కూడా ప్రతిభ కనపరిచి పాఠశాలకు,గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## అశ్వగంధ పంటలో శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

మద్దికెర,డిసెంబరు 19,ప్రభాతవార్త

మద్దికెర గ్రామం నందు సాగు చేస్తున్న ఔషధ పంటైన అశ్వగంధ పంటను ఉద్యాన పరిశోధన వెంకటరామన్నగూడెం,శాస్త్రవేత్తలు డా.టి నాగలక్ష్మి,డా.డి రంగన్న,డా.ఎస్ ఆదర్శ క్షేత్ర సందర్శనలు నిర్వహించారు. పంటపై ఆశిస్తున్న కీటకాలు,తెగుళ్లను నమోదు చేసుకోవడంతో పాటు మేలైన పంట సాగు పద్ధతులను రైతులకు వివరించారు. పంటసాగులో మెలకువలు రైతులకు విపులంగా వివరించారు. ఉద్యాన అధికారి డా. ఇందిర,ఉద్యాన అధికారులు, వ్యవసాయాధికారి రవిల సహకారంతో పంట క్షేత్ర సందర్శనలు నిర్వహించడం జరిగింది. అఖిల భారత్ ఔషద మరియు సుగంధ ద్రవ్య పంటల సాగు పెంపొందించడానికి రైతులకు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఓ భోజరాజు,వ్యవసాయ సహాయకులు జాకీర్ హుస్సేన్,ఆనంద్,రాణి,రైతులు పాల్గొనా న్నరు.

## అంబేద్కర్‌ను అవమానించడం అమిత్‌షాకు తగదు

ఆదోని,డిసెంబరు 19,ప్రభాతవార్త

పార్లమెంట్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించడం తగదని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ అన్నారు. ఆదోని డివిజన్ ఎమ్మిగనూరు పట్టణంలోని గురువారం సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మొన్నటి దినం పార్లమెంట్ లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరుని మాటిమాటికి ఎందుకు తలుచుకోవాలని కోపంగా మాట్లాడి అవమానించడం హేయమైన చర్య అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించడంలో కాంగ్రెస్,బిజెపి పార్టీలో దొందు దొందేనని ఆయన అన్నారు.

## మృతిచెందిన విఆర్‌ఓ కుటుంబానికి ఆర్థిక సహాయం

తుగ్గలి,డిసెంబరు 19,ప్రభాతవార్త

ఇటీవల రోడ్డు ప్రమాదంలో పగిడిరాయి గ్రామానికి చెందిన రాంకొండ విఆర్‌ఓ కావలి తలారి శ్రీనివాసులు మృతిచెందారు. గురువారం తుగ్గలి తహశీల్దార్ రమాదేవి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రెవెన్యూ అసోసియేషన్ తరుపున రూ.66వేలు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు,గ్రామ విఆర్‌ఓ నయోమి,విఆర్‌ఓ కాశీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## తొక్కిసలాటలో గొర్రెలు మృత్యువాత

తుగ్గలి,డిసెంబరు 19,ప్రభాతవార్త

మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో ఆ గ్రామానికి చెందిన తెలుగు నరేష్,మాభాష,సుంకన్న,రాయల్ ఖాజాలకు చెందిన 54గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెలు,మేకల మందల గుంపు బెదరడంతో ఒకదానిపై ఒకటి తొక్కిసలాటలో గొర్రెలు,మేకలు మృతిచెందాయి. మేకలు,గొర్రెలు మృతిచెందడంతో వారు కన్నీరు మున్నీరయ్యారు. గొర్రెలు మృత్యువాత పడడంతో కనీసం రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచ్ సలహాదారుడు ప్రతాప్ యాదవ్ మాట్లాడుతూ ఒకేసారి 54గొర్రెలు తొక్కిసలాటలో మృతిచెందడం బాధాకరమని అన్నారు. ఈ విషయం పత్తికొండ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి గొర్రెల బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు.

## ఈ నెల 24వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

మద్దికెర,డిసెంబరు 19,ప్రభాతవార్త

సుపరిపాలనలో భాగంగా ప్రశాసన్ గావోంకి ఓర్ ఈ నెల 19నుండి 24వ తేదీ వరకు మద్దికెరలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కొండయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి యొక్క సమస్యలను లిఖీతపూర్వకంగా తెలియజేసి ఈ సదావకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పోలీస్‌స్టేషన్‌కు చేరిన తెలుగు తమ్ముళ్ల పంచాయతీ

మద్దికెర,డిసెంబరు 19,ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా మండలంలో మాత్రం తెలుగుదేశం పార్టీ సమ్మెట్టిలో మాత్రం వర్గపోరు ఆగడం లేదు. ఈ మద్దికెరలో నిర్వహించిన సాగునీటి సంఘం ఎన్నికల్లో తెలుగుతమ్ముళ్ల మధ్య వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. పెరవలి గ్రామంలో తెదేపా సీనియర్ నాయకుడు ఒక పెద్దాయన ఎమ్మెల్యే చెప్పినట్లుగా నడుచుకుందాం అనడంతో ఈ రాద్ధాంతం అంతా బట్టబయలై పంచాయతీ కాస్త పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న ఒక తెదేపా ప్రధాన నాయకుడు అక్కడున్న ఒక వ్యక్తికి ఐదు సంవత్సరాలు అధికారం నీదే అని హామీ ఇవ్వడంతో పెద్దాయనకు కాస్త చిర్రెత్తుకు చూసి మాట్లాడడంతో పెరవలి గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీకి సంబంధించిన వారు పెద్దాయనను అలా మాట్లాడితే ఎలా అని నిలదీశారు. ఎస్సీ కాలనీకి చెందిన వారు నన్ను నిలదీశారని మండల కేంద్రంలో ఉన్న ప్రధాన నాయకుడికి తెలపడంతో ఇరువర్గాల మధ్య పార్టీలో వర్గపోరుతో పాటు పార్టీలోని కుల వివక్షత పోరు జరగడంతో పంచాయతీ కాస్త పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు మాత్రం పంచాయతీలు పోలీస్‌స్టేషన్‌లో కాదు బయట చేసుకోమని ఉచిత సలహా ఇచ్చి ఇరువర్గాల వారిని పంపడం జరిగింది.

## రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోండి..

**హాలహర్వి, డిశంబర్19, ప్రభాతవార్త:** రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని కామినహాల్, మెదేహాల్ గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులకు ఆర్డీఓ భరత్‌నాయక్ హాజరయ్యారు. గ్రామాల్లోని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుల ద్వారా రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అంతేగాకుండా ఈ పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నజ్మాభాను, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐ మహేష్, వీఆర్వోలు రాఘవేంద్రస్వామి, ఈరప్ప, రమేష్, లింగన్న, కాశీం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైలును సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

**ఆదోనిలీగల్, డిశంబర్19, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని సబ్‌జైలును గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సందర్శించారు. సబ్‌జైలులోని ఖైదీల వివరాలు, ఖైదీలకు అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి, జైలు పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. 70 సంవత్సరాలు పైబడిన, ప్రాణాంతక, అనారోగ్య ఖైదీల వివరాలను సేకరించారు. ఖైదీలతో మాట్లాడడానికి వచ్చే వారికి మాట్లాడే సదుపాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు ఉచిత న్యాయసేవలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ స కౌన్సెల్ ఎం.శివరామచంద్ర, ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, డా.జగదీష్, న్యాయవాది ఆనంద్, జైలు సూపరింటెండెంట్ డా.జగదీష్, జైల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రబీ పంటలకు బీమా చెల్లించండి - ఏవో సుబ్బారెడ్డి

**బనగానపల్లెరూరల్, డిసెంబర్19, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన పిఎం కిసాన్‌లో భాగంగా ప్రధాన మంత్రి ఫసల్ యోజన బీమా పథకానికి సంబంధించి రైతులు రబీ పంటలకు బీమాను చెల్లించాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు వారి పంటలను నమోదు చేయించుకోని బీమా చెల్లించడం వల్ల పంటకు ఎలాంటి నష్టం వాటిల్లినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి బీమా చెల్లిస్తాయని ఆయన తెలియజేశారు. ఇందులో భాగంగా వేరుశనగ పంట వేసిన రైతులు రూ.64, జొన్న రైతులు రూ.60, మినుము పంట రైతులు రూ.48లు, ఉల్లి రైతులు రూ.90లు, వరి రైతులు రూ.126లు, శనగ రైతులు రూ.84ల బీమా మొత్తాన్ని చెల్లించాల్సిందిగా ఆయన కోరారు. కావునా మండలంలోని రైతులందరూ ఈ బీమాను దృష్టిలో ఉంచుకుని ఈనెల 31వ తేదిలోపల బీమా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు.

## రైతులు వ్యవసాయరంగంలో రాణించాలి

- మండల వ్యవసాయ అధికారి హేమసుందర్‌రెడ్డి

**గడివేముల, డిశంబర్19, ప్రభాతవార్త;** రైతులు వ్యవసాయరంగంలో రాణించాలని మండల వ్యవసాయ అధికారి హేమసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని గడిగరేవుల, చిందుకూరు, గ్రందివేముల గ్రామాల్లో సాగైన జొన్న, మొక్కజొన్న, సోయాబీను పంటలను క్షేత్ర సందర్శన చేశారు. అక్కడ రైతులతో జొన్న, మినుము, ఇతర పంటలను ఈనెల 31వ తేదీ వరకు పంటల బీమా చేసుకునే దానికి అవకాశం పొడిగించడం జరిగిందన్నారు. అదేవిధంగా పంటల్లోని జొన్నలో కత్తెర పురుగును చూసి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను తెలియజేశారు. గడివేముల మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతుసేవ సిబ్బందితో వివిధ వ్యవసాయ కార్యక్రమాలైన ఈపంట, పీఎం కిసాన్, పంటలబీమా, పొలం పిలుస్తోంది, కౌలు రైతుల రుణాలపై అవగాహన కల్పించారు. అలాగే తనిఖీల్లో భాగంగా దుర్గాభవానీ మరియు వెంకటేశ్వర ట్రేడర్స్ షాపులను తనిఖీ చేసి వారికి చట్టప్రపకారం తీసుకోవాల్సిన విధి విధానాలపై తెలియజేశరు.

## చేతిపంపు మరమ్మత్తుల పనులు ముమ్మరం

గ్రామ సర్పంచ్ మాబు ఆధ్వర్యంలో పనులు

**ఆత్మకూరు,డిసెంబర్19,ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లే కీలకంగా అభివృద్ధి పనులు సాగించే దిశగా ముందుంటారు. ఈ క్రమంలోనే ఆత్మకూరు మండల పరిధిలోని కురుకుంద గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ భర్త మాబు ఆధ్వర్యంలో పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. గురువారం గ్రామంలో త్రాగునీటి సమస్యకు తలెత్తకుండా ముందస్తుగానే చేతిపంపు మరమ్మత్తుల పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అభివృద్ధి కోసం సేవలు అందించడం హర్షించదగ విషయమని కొనియడారు. ప్రస్తుతం గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య పనులు డ్రైనేజి కాల్వలు, సీసీరోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్ దీపాలు, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించే విదంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సర్పంచ్‌లే కీలకంగా ఉంటూ అభివృద్ధి పథకంలో ముందుకు వెళ్తున్న గ్రామ సర్పంచ్ కురుకుంద గ్రామంలో మండలానికే ఆదర్శ సర్పంచ్‌గా మాబు నిలిచారని ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## చిన్నతుంబళంలో ఎస్‌ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలి

పెద్దకడుబూరు,డిసెంబరు 19,ప్రభాతవార్త

మండల పరిధిలో చిన్నతుంబళం గ్రామంలో ఎస్‌ఎస్ ట్యాంకు ఏర్పాటు చేసి చిన్నతుంబళం,పులికనుమ, బాపురం,పులికన్వి తదితర గ్రామాలకు తాగునీరు అందించాలని,ప్రజాసమస్యలపై దశలవారిగా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు,వెంకటేష్,మండల కార్యదర్శి తిక్కన్న,పరమేష్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలో చిన్నతుంబళం గ్రామంలో సిపిఎం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందని అందుకు ప్రజలు సహకారం అందించాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు దశలవారి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అర్హులైన పేదలందరికి ఇంటి స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించాలని,కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నతుంబళం సిపిఎం నాయకులు హనుమంతు,బసలదొడ్డి సిపిఎం నాయకులు వెంకటేష్,ఉప్పర ఈరన్న,శ్రీనివాసులు,రాజేంద్ర,కె రామన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రాంగణాల్లో మతపరమైన ప్రచారాలు నిషిద్ధం

**కర్నూలు విద్య, డిసెంబర్ 19, ప్రభాతవార్తః** ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రాంగణాల్లో మతపరమైన ప్రచారాలు నిషిద్ధమని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డైరెక్టర్ నవంబర్ 15 2024న ఉత్తర్వులు ఇచ్చినట్లు కర్నూలు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాలతీ పేర్కొన్నారు. స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ మరియు బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో ప్రహరి గోడ లోపలి భాగంలో క్రిస్టియన్ మతానికి చెందిన క్రీస్తు శ్లోకాలు, బోధనలు, వ్యాఖ్యానాలు రాశారని జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేసినట్లు మాలతీ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మతాలకు చెందిన విద్యార్థులు బోధనాభ్యాసం కొరకు వస్తుంటారని ఇలాంటి మతపరమైన ప్రచారాలు వారి జీవనవిధానంపై ప్రభావితం చేస్తాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యానాలు రాసిన వారిపై, వాటికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కారం

పత్తికొండ,డిసెంబరు 19,ప్రభాతవార్త

గ్రామ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహశీల్దార్ రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని మూడో సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వే,భూసమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు,అడంగల్ వివిధ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ సాగర్,రవికుమార్,భాష,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకై పాటుపడదాం

**వెల్దుర్తి,డిసెంబర్19,ప్రభాతవార్త :** ప్రయాగ్‌లో జరిగే కుంభమేళాలో పర్యావరణ పరిరక్షణకై తమ వంతుగా పాటుపడదామని హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షులు వి.యం.హరిసింహానాయుడు అన్నారు.ఈ సందర్భంగా గురువారం రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయురాలు,రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్వయంప్రభ హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో వర్మీకంపోస్టు నిర్వాహకులు హరిక్రిష్ణకు స్టీల్ ప్లేట్లు,ఖాళీ సంచులు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి పదివేల స్టీల్‌ప్లేట్లు,సంచులు ప్రయాగ్‌లో కుంభమేళాకు పంపేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఇవి పంపడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించవచ్చన్నారు.సత్ఫలితంగా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షులు వి.యం.హరిసింహానాయుడు,సభ్యులు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మోటివేషన్ కలిగించిన గ్రూపు -I అధికారి

– పగిడ్యాల జెడ్పీపాఠశాల పూర్వపు విద్యార్థి బాలగోవిందు



**పగిడ్యాల, డిశంబరు 19,ప్రభాతవార్త :** పగిడ్యాల జెడ్పీపాఠశాల పూర్వపు విద్యార్థి 2023లో గ్రూపు -1లో ఉత్తీర్ణత సాధించి తిరుపతి తిరుమల దేవస్థానంలో గ్రూపు -1 అధికారిగా స్టేట్ అడిట్ అధికారిగా విదులు నిర్వహిస్తున్న వి.బాలగోవిందు విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మదుసూధనరావు గురువారం 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలగోవిందు మాట్లాడుతూ ఈ పాఠశాలకు పూర్వచరిత్ర ఘనమైనదనీ ఎందరో ఈ పాఠశాలవిద్యార్థులు వివిధప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్నారన్నారు. అదేవిధంగా రాష్ట్రజాతీయ, అంతర్జాతీయ స్థాయిస్థాయిలో పోటీలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకొని బంగారు పతకాలు సాధించారన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఏవిధంగా మెలగాలి, ప్రణాళికలు రూపొందించుకోవాలి, ఏవిధంగా సమాయాంత్తం కావలి కావలసిన వనరులను ఏవిధంగా సమకూర్చుకోవాలో సవివరంగా వివరించారు. గత 2 సంవత్సరాల నుండి రాష్ట్ర ,జాతీయ స్థాయిలో పాల్గొన్న పాఠశాల క్రీడాకారులను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బందితో కలిసి అవసరమైన తనవంతు సహకారం అందజేస్తానని వి.బాల గోవిందు తెలిపారు. ఈ సందర్భంగా వి.బాలగోవిందును పాఠశాల సిబ్బంది దుశ్శాలువాతో ఘనంగా సన్మాం చేశారు. విద్యార్థులు తమకు ప్రేరణ కలిగించిస్టేట్ అడిట్ అధికారి వి.బాలగోవిందు కార్యక్రమం ఏర్పాటు చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మధుసూధనరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు కె. మధు సూధనరావు , సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.ఏ రషీద్‌మియ్య, డివి.రమణారావు, క్రీడాశ్రీ తోకల పీతాంబరెడ్డి, పీడి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తాం

:- చిప్పగిరి తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్



**చిప్పగిరి,డిసెంబరు 19,ప్రభాతవార్త:** గ్రామంలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన భూ సమస్యలను ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కారం చేస్తామని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన చిప్పగిరిలో సర్పంచ్ దాసరి గోవిందరాజులు అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శి పిఎం గోవిందప్పకు చిప్పగిరి గ్రామస్తులు భూ సమస్యలకు సంబంధించిన వినతులను అందచేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో అన్నదమ్ముల భాగాలు,కొలతలలో తేడాలు,ఒకరికి బదులుగా మరొకరి పేరు తప్పుగా ఉన్నచో వాటి పరిష్కారం నిమిత్తం అలాగే ఏళ్ల తరబడి పరిష్కారం కాని ప్రతి భూ సమస్యను జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ భవ్య ఆద్వర్యంలో ఆర్డీఓ భరత్ నాయక్ సమక్షంలో భూ సమస్యలకు పరిష్కారాన్ని చూపుతుందన్నారు. రైతులు ఇబ్బందులు పడకూడదనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయించి రైతులకు పరిష్కార మార్గాన్ని చూపుతుందన్నారు. ప్రతిఒక్క రైతు వారి వారి గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండా గోవిందప్ప,జనార్ధన్ స్వామి,బోగేష్ స్వామి,సీనియర్ సర్వేయర్ నారాయణ,ఇంజనీరింగ్ అసిస్టెంట్ పావని,వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గాయత్రి,చిప్పగిరి సచివాలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటరాముడుతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు..

## సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేస్తాం



**దేవనకొండ,డిసెంబరు 19,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారిణి పి గీత అన్నారు. గురువారం ఐపిఎస్ అధికారి ఆకె రవికృష్ణ ఐజి విజ్ఞప్తి మేరకు కప్పట్రాళ్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు వలసలు వెళ్లిన పిల్లల కోసం ఒక సీజనల్ హాస్టల్ మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆలస్కో అధికారి సురేష్ రాజు,పాఠశాల ఇంచార్జ్ హెడ్మాస్టర్ హీనత్ నాయుడు,సీనియర్ ఉపాధ్యాయుడు గోకారి,సిఆర్పి గంగన్న పాల్గొన్నారు.

## అమిత్ షా భేషరతుగా క్షమాపణ చెప్పాలి

:- ఏపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తాలుక కార్యదర్శి రాముడు,ఉపాధ్యక్షులు రవికుమార్



**పత్తికొండ,డిసెంబరు 19,ప్రభాతవార్త :** పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేకుంటే దళిత జాతి పెద్దఎత్తున ఉద్యమం చేపట్టి అంబేద్కర్ ఆశయ సాధన కొరకు ఎక్కడవరకైనా తెగిస్తామని ఏపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తాలుక కార్యదర్శి రాముడు,ఉపాధ్యక్షులు రవికుమార్‌లు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మేధావి, అపరజ్ఞాని, రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా సాక్ష్యాత్తు పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అదే పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో దళిత జాతి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కొరకు ఎక్కడివరకైనా తెగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు రమణ,దళిత సమాఖ్య సంఘం నాయకులు శ్రీనివాసులు,థామస్,జయన్న,విద్యార్థి సంఘం నాయకులు మధుబాబు,వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు




**చిప్పగిరి,డిసెంబరు 19,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆదేశాల మేరకు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు చిప్పగిరి ఎంపిడిఓ అల్లాబకాష్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన చిప్పగిరిలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ నేటి నుండి 24వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాసమస్యలపై ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఏమున్నా ప్రజలు నేరుగా శిబిరానికి వచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ అధికారి సమస్యను నిర్లక్ష్యం చేయకుండ ఎవరి పరిధిలో సమస్య ఆ అధికారి వెంటనే పరిష్కారం చూపాలన్నారు. విధుల పట్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై జిల్లా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అప్పుడే విధుల పట్ల తాము చేసిన పనికి సంతృప్తికరంగా ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్‌ను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి బాలన్న,మండల ఆస్పర్వేషన్ బ్లాక్ నరసింహ, పంచాయతీ కార్యదర్శులు సురేంద్రనాథ్,జయరాం నాయక్,నరసింహ,సుధీర్ కుమార్, ప్రమీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ..!



**హొళగుంద,డిసెంబరు 19,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి జీర్ణోధారణ మరియు కొత్తగా నిర్మించే శిల దేవాలయ నిర్మాణ పనులకు గజ్జహళ్లి తిమ్మారెడ్డి,గజ్జహళ్లి హనుమంతరెడ్డి,గజ్జహళ్లి విరుపాక్షిరెడ్డి వంశీకులు గజ్జహళ్లి తిమ్మారెడ్డి,సతీమణి గజ్జహళ్లి సావిత్రమ్మ, గజ్జహళ్లి హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు,గజ్జహళ్లి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యుల ఆద్వర్యంలో పురోహితులు జేకె నర్సింగాచార్, కెజె రాజీవ్‌ఆచార్‌లు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రోచ్ఛరణలు పఠిస్తూ గణపతి పూజ,గోపూజ,గోప్రదక్షణ,హోమం,జైశ్రీరామ్,జై ఆంజనేయ,జై రామలక్ష్మణ,జయజయ ధ్వనుల మద్య భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పూజలు నిర్వహించి ఆంజనేయ ఆలయంపై కప్పు గోడను గడ్డపారతో తిమ్మారెడ్డి,సావిత్రమ్మలు గోడలను కూలగొట్టి మట్టిని ఎత్తివేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త హనుమంతరెడ్డి ఆద్వర్యంలో తీర్థప్రసాదాలు,అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ గజ్జహళ్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు మరియు వంశపార్యంపర్య ధర్మకర్త గజ్జహళ్లి హనుమంతరెడ్డిలు మాట్లాడుతూ ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి వందేళ్లు అయ్యిందని దాని ఆలనాపాలన తామే చూస్తున్నామని అన్నారు. 1959లో తమ తాత గజ్జహళ్లి తిమ్మారెడ్డి కుమార్తె శంకరమ్మలు మొదటిసారిగా ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోధారణ పనులు చేశారన్నారు. స్వామి వారికి ప్రతి నెల నూనె డబ్బా సరఫరా చేస్తున్నామని అలాగే 2015లో చెన్నకేశవ స్వామి ఆలయం నిర్మించామని మరియు కెరె హనుమప్ప ఆలయానికి రూ.3లక్షలతో ఆలయంలో సిసిరోడ్డు వేశామని,కొత్త గేటు నిర్మించామని ఆలయం చుట్టూ ప్రహరీ గోడ కట్టించామన్నారు. శ్రీ పోతులింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేశామని,శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నూతన శిలా కట్టడాన్ని తాము సొంత ఖర్చులతో అందరి మద్దతుతో రెండోసారి ఆలయాన్ని కట్టిస్తున్నామని ఆలయ నిర్మాణానికి అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని తమ కుటుంబం ధార్మిక కార్యక్రమాల్లో ఎల్లప్పుడు ముందుంటూ సహాయ,సహకారాలు అందిస్తుండాలని పేర్కొన్నారు. భూమి పూజ కార్యక్రమంలో భక్తులు శివరామరెడ్డి,ఆదినారాయణరెడ్డి,కృష్ణసాగర్‌రెడ్డి, రామ్‌సాగర్‌రెడ్డి,వరలక్ష్మిరెడ్డి,ఎం హనుమంతరెడ్డి, వెంకన్నగౌడ్,పూజారి రామ, సోమి,కాళ్లప్పాచారి,రామలింగ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలు



**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబర్19,ప్రభాతవార్త:** లోక కల్యాణం కోసం దేవస్థానం గురువారంనాడు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీదత్తాత్రేయస్వామివారికి విశేష పజలను నిర్వహించింది.ప్రతి గురువారం దేవస్థానసేవగా(సర్కారీ సేవగా)ఈ కైంకర్యం జరిపించబడుతోంది.ఈ పూజకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది.ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృత్యాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.లోకద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తా త్రేయునిగా అవతరించారు.అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు.ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి.అందుకే ఈ వృక్షాన్ని దత్తాత్రేయ వృక్షమని పేరు.కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు.వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది.

## ప్రజా సమస్యలపై ప్రత్యేక శిబిరం



**పత్తికొండ,డిసెంబరు 19,ప్రభాతవార్త:** ఈ నెల 19వ తేదీ నుండి 24వరకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజా సమస్యలపై ప్రత్యేక శిబిరం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సువర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజావేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రభుత్వం వారోత్సవాల సందర్భంగా పట్టణ,గ్రామాల్లో వీధిలైట్లు,డ్రైనేజీ కాలువలు,సిసిరోడ్లు,ఆరోగ్య సమస్యలపైన ప్రజావేదికలో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ వారోత్సవాలను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ దస్తగిరి,టైపిస్ట్ శశి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారానికే రెవెన్యూ సదస్సులు

**దేవనకొండ,డిసెంబరు 19,ప్రభాతవార్త :** గ్రామాల్లో భూ సమస్యలను అధికారులు సాగదీస్తున్నారని కేవలం ప్రచారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని సిపిఎం జిల్లా నాయకులు బి వీరశేఖర్ అన్నారు. గురువారం పాలకుర్తిలో జరిగిన రెవెన్యూ సదస్సు సందర్భంగా తహశీల్దార్ కారు ముందు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు బైఠాయించి పాలకుర్తి రెవెన్యూ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే తహశీల్దార్ మరియు స్పెషల్ ఆఫీసర్‌లు మొక్కుబడిగా సమాధానం చెప్పి వెళ్లడంతో సిపిఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం అని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిష్కార సమస్యల పరిష్కారం శూన్యంగా ఉందన్నారు. తక్షణమే అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు కచ్చితంగా నెలలోపు సమస్య పరిష్కరిస్తామని చెప్పిన హామీ మేరకు సిపిఎం నాయకులు నిరసనలు విరమించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి,తెర్నేకల్ గ్రామస్తులు,రైతులు,అర్జీదారులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబర్19 ,ప్రభాతవార్త:** శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)గురువారంనాడు ఉషోదయ కూచిపూడి కళా సంక్షేమ సంఘం,విశాఖపట్నం వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గణపతి కౌత్వం,శివతాండవం, మూషికవాహన, అఖిలాండేశ్వరి,లింగాష్టకం,తదితర గీతాలకు ఎం.ఆరాధ్యరెడ్డి,శిరివదన,శృజన, భార్గవి,చేతన, మోక్షిత,శ్రీనిత్య, తదితరులు నృత్యప్రదర్శన చేసారు.కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు హరికథ,బుర్రకథ,సం ప్రదాయ నృత్యం,వాయిద్య సంగీతం,భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాదన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## దేవనకొండలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు



**దేవనకొండ,డిసెంబరు 19,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన దేవనకొండకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు వచ్చేశాయి. ఈ సందర్భంగా విద్యుత్ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టర్లు మల్లెపల్లి రంగడు,అంజిలు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు బిల్లులు తగ్గించడానికి ఉపయోగపడతాయన్నారు. ఆదానీ కంపెనీ ద్వారా మండలంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నట్లు తెలియజేశారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



**హొళగుంద,డిసెంబరు 19,ప్రభాతవార్త:** భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మౌలాలీ,తహశీల్దార్ సతీష్‌లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని సులువాయి గ్రామంలోని సచివాలయంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుండి దాదాపు 16అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుబాటులో లేని భూస్వాములు,రైతన్నలు మండల కేంద్రానికి వచ్చి అర్జీలు పెట్టుకుంటే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హసేనప్ప,రాఘవేంద్ర, వన్నూరుసాబ్,విఆర్‌ఓ నాగరాజు,తెదేపా నాయకులు నాగరాజు, ప్రభు,రఫిక్, నీలప్ప తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల పట్టణంలోని కొన్ని కాలనీలలో నీటి సరఫరాకు అంతరాయం

**నంద్యాల హాస్పటల్,డిసెంబర్ 19,ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలోని వీక్లీ మార్కెట్ ఫిల్టర్ బెడ్ నందు గల నీటి పంపును ఈ నెల 20న శుభ్రపరచటం జరుగుతున్నందున ఈ క్రింది కాలనీలలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని పురపాలక సంఘం కమీషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. వై.ఎస్.ఆర్.నగర్, నందమూరి నగర్,బాలాజీ కాంప్లెక్స్,మూలానపేట, ఫరూక్‌నగర్, గుడిపాడు గడ్డ, తోటలైన్, 1వ వార్డు హరిజనవాడ, టైర్మల్ వీధి, బంగారు అంగళ్ళ వీధి,సంగపేట, తెలుగుపేట, రోజాకుంటాచ చాందబండ, శ్రీనువాసనగర్, సంజీవనగర్, డేనియల్ పురం, రామనందరెడ్డి నగర్, పద్మావతి నగర్, పటాస్‌పేట, మాల్దర్ పట్టి, చెంచయ్యతోట ఏరియాలో అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున ప్రజలు సహకరించాలని కమీషనర్ తెలిపారు.

## ఆబా ఐడి ద్వారా పేషెంట్‌కు ట్రీట్‌మెంట్ ప్రాపర్‌గా అందుతుంది



**కర్నూలు హాస్పిటల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజు 3 వేల మంది ఔట్ పేషెంట్లు వారి వారి ఆరోగ్యం చూపించుకోవడానికి వస్తుంటారని అందులో భాగంగా అయుస్మాన్ భారత్(ఆబా) ఈ డిజిటల్ ఓపీ సేవల కొరకు పేషెంట్‌కు సంబంధించిన అధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ మరియు ఎన్టీఆర్ వైద్యసేవా కార్డు ఆబా ఐడి కార్డు వారి వెంట తీసుకురావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దీని ద్వారా పేషెంట్‌కు ఆసుప త్రిలో త్వరగా ఓపి సేవలు మరియు ట్రీట్ మెంటు అందుతుందన్నారు. దీని వల్ల రోగులకు క్యూలైన్లో కూర్చొని ఎక్కువసేపు సమయాన్ని వృదాచేయకుండా వారి యొక్క స్మార్ట్ ఫోన్ ద్వారా డిజిటల్ ఆబా యాప్ ద్వారా ఓపి టోకెన్ నంబరు ద్వారా ఓపి జనరేట్ అవుతుందన్నారు. ఆబా ఐడి ద్వారా పేషెంట్‌కు సంబంధించి ప్రతి హిస్టరీ అందులో పొందుపరుస్తారని తెలిపారు.

## గూడూరులో రెవెన్యూ సదస్సు

**గూడూరు,డిసెంబర్ 19, ప్రభాతవార్త:** గూడూరు మండలం మల్లాపురం గ్రామంలో గురువారం తాహశీల్దార్ రామాంజినేయులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుల్లో తాహశీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సుల వల్ల భూ సమస్యలపై ఇబ్బందులు పడుతున్న రైతులు విన్నవించుకుంటే వాటిని తక్షణమే పరిష్కరిస్తామని సూచించారు. అనంతరం జరిగిన సదస్సుల్లో గ్రామంలోని అధిక సంఖ్యలో రైతులు వారి పొలం సమస్యల గురించి అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసనకు నూతన ఒరవడిలో బోధన



**కర్నూలు విద్య, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 1, 2 తరగతుల విద్యార్థులకు బోధించే అంశాల నూతన ఒరవడిలో శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా విచ్చేసిన జి అపర్ణ వివరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఎఫ్ఎల్ఎన్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమానికి శ్రీలక్ష్మి శ్రీనివాస కళాశాల అఫ్ ఎడ్యుకేషన్ బి తాండ్రపాడు నందు నిర్వహించారు. ఈశిక్షణ కార్యక్రమంలో భాగంగా టిఎల్ఎం మేళాను సందర్శించి ఉపాధ్యాయులు తయారుచేసిన టిఎల్ఎంను అభినందించారు. ఈకార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్లు రమేష్, డైట్ లెక్షరర్ మాట్లాడుతూ ఈశిక్షణ పాఠశాలల్లో అమలుచేసే బాధ్యత ఉపాధ్యాయుల ఉందన్నారు. ఎ ఎం ఓ డా.షేక్ రఫీ మాట్లాడుతూ మండల ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల బాష గణితంలో పునాది బలంగా ఉంటేనే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధమ కో ఆర్డినేటర్ దావీదు, కేఆర్పీలు, డిఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను క్యాబినెట్ నుండి భర్తరఫ్ చేయాలి



**కర్నూలు మున్సిపల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** రాజ్యాంగ పితామహుడు డా.బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను కేబినెట్ నుండి భర్తరఫ్ చేయాలని బిసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి భరత్‌కుమార్ ఆచారి అన్నారు. గురువారం స్థానిక మద్దూరు నగర్‌లోని విద్యార్థి సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద కోట్ల మంది దేవుడిగా అభిమానించే అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన అమిత్‌షాను కేబినెట్ నుండి పార్టీ నుండి సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో జరగబోయే జమిలిలో బిజెపి కమలం కమిలిపోతుందన్నారు. దేశంలో అంబేద్కర్ పేరు చరిత్రను కనమరుగుచేసేలా బిజెపి కుట్ర చేస్తుందన్నారు. అంబాని అదానిలకు ఊడిగం చేసే అమిత్‌షాకు అంబేద్కర్ అంటే పేరు కాదు రాజ్యాంగ రూపకర్త, దేశ ప్రజలకు రాజ్యాంగ రూపంలో స్వేచా సమానత్వం కల్పించిన నాయకుడని గుర్తుచేశారు. సప్త సముద్రాల అవుతల అంబేద్కర్‌ను విదేశాలు నెత్తిన పెట్టుకుంటే మనదేశంలో నాయకులు ఈవిధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శేఖర్ నాయుడు, కార్యదర్శి మద్దిలేటి, మాదిగ సుంకన్న, రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో డిజిటల్ తరగతులు



**కర్నూలు విద్య, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** ఇంటరాక్టివ్ ప్లాట్ ద్వారా విద్యార్థులకు సమర్థవంతమైన ఖచ్చితమైన డిజిటల్ తరగతులు ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ తెలిపారు. స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో గురువారం ఎలైట్ విభాగంలో తల్లిదండ్రుల చేతుల మీదుగా డిజిటల్ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తరగతి గదిలో టీచర్ సంక్లిష్టతలను పరిష్కరిస్తు వారి ప్రశ్నలకు సమర్థవంతంగా ప్రతిస్పందించడానికి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నామన్నారు. డిజిటల్ తరగతుల వల్ల విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా ఎక్కువ కాలం గుర్తుండేవిధంగా బోధన జరుగుతుందన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు పరిపక్వత చెందడానికి నారాయణ విద్యా సంస్థలు ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఏడి వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరీ, రాధలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరం



**వెలుగోడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** రైతులు పండించే పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా చేయడం ఎంతో శ్రేయస్కరమని ఏవో పనవ్ కుమార్ అన్నారు. గురువారం కుందకందాల గ్రామాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగుచేసిన వరి పంటలో పంటకోత ప్రయోగాలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పంటలు సాగుచేస్తే మొదటి రెండు సంవత్సరాలు దిగుబడి తక్కువ అయినా మూడవ సంవత్సరం నుండి మంచి దిగుబడులు వస్తాయని ఆయన పేర్కొన్నారు. పొలాల్లో సహజ ఎరువుల ద్వారా వ్యవసాయం చేయడం వల్ల భూమి సారవంతమై పంట నిరోధకశక్తి పెరిగి అధిగ దిగుబడులు ఇస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల వచ్చిన పంట ప్రజలకు ఆరోగ్యకరమైన పోషకపదార్థాలు కలిగి ఉంటుందని దీని వల్ల ప్రజల ఆరోగ్యస్థితిగతులు మెరుగుపడతాయన్నారు. గ్రామానికి చెందిన సుబ్బరాయుడు సహజ ఎరువుల ద్వారా సాగుచేసిన ఒక ఎకరాకు 77 బస్తాలు దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. రైతులందరు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు తెలుసకొని సేంద్రియ ఎరువులు, సహజ ఎరువులు వాడి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈఓ అంజిత్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అప్సర్ అలీ, మహాబూబ్ బాషా, నాగరాజు, నజీర్, కృష్ణస్వామి, శ్రీనివాసులు, సామేశ్వరమ్మ, హేమలత, పలువురు రైతులు పాల్గొన్నారు.

## అనుగొండలో రెవెన్యూ సదస్సు



**కోడుమూరు,డిసెంబర్ 19, ప్రభాతవార్త :** కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుల్లో తాహశీల్దార్ వెంకటేష్ నాయక్ ప్రసంగించారు. గ్రామంలో భూ సమస్యలపై అవస్థలు పడుతున్న రైతులు ఈ సదస్సుల్లో విన్నవించుకుంటే వాటిని తక్షణమే పరిష్కరిస్తామని సూచించారు. అన్నదమ్ముల భాగ పరిష్కారంతో పాటు, ఆన్‌లైన్ నమోదు,పట్టాదాసు పాసు పుస్తకాల వంటి సమస్యల గురించి సదస్సు దృష్టికి తీసుకురావాలన్నారు. రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం జరిగిన సదస్సుల్లో గ్రామంలోని 12 మంది రైతులు వారి పొలంకు సంబంధించిన సమస్యల గురించి అధికారులకు విన్నవించారు. రైతుల నుంచి స్వీకరించిన సమస్యలను 45 రోజులల్లో పరిష్కారిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ బి.కె వెంకటేశ్వర్లు,ఎడిఏ సాలురెడ్డి,ఆర్ఎస్‌డిటి క్రిష్ణమూర్తి,గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలి - ఎస్టీయు



**బనగానపల్లె, డిసెంబర్19, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కలి ్పంచాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబిక్ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టీయు సభ్యత్వ నమోదు సమస్యల స్వీకరణలో భాగంగా ఆయన గురువారం బనగానపల్లె మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అజాంబిక్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించడం, 117జీవోను రద్దు చేయడం, హైస్కూల్ ప్లస్‌కు స్వస్తి పలకడం, ప్రాథమికోన్నత పాఠశాలలో సరైన నిర్ణయం తీసుకోవడం పట్ల ఎస్టీయు హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. అదే విధంగా హైస్కూల్ ప్లస్ స్థానంలో ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో కొత్తగా ప్రారంభించబోతున్న జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ నిబంధనలు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నందున ఉపాధ్యాయులు 30సంవత్సరాలలో కనీసం ఒక ప్రమోషన్ కూడా తీసుకోకుండా పదవీ విరమణ చేస్తుండడం, బోధనేతర సిబ్బందికి సర్వీస్‌లో నాలుగైదు సా ్థయిలో ప్రమోషన్లు పొందటం పట్ల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరన్నారు. కనుక రాజ్యాంగంలో ఆర్టికల్ 309 ప్రకారం రా ష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్న అధికారాన్ని వినియోగించి ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సర్వీస్‌ను ఏకీకృతం చేసి నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ నిబంధనలను సుఖాంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు సంక్రాంతి కానుకగా మధ్యంతర భృతి, కరువు భత్యాలు, ఆర్థిక బకాయిలు విడుదల చేసి ఉద్యోగులను ఆర్థిక సమస్యల నుండి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుండి 5వ తరగతి వరకు కేవలం మాతృభాషలోనే బోధన జరిగేలా అధికారిక ఉత్తర్వులు వెలువరించి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేయాలని, అకాడమిక్ ఇయర్ మధ్యలో ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా కేవలం బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని, ఎస్సెస్సీ పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ ప్రతిపాదించిన 100రోజుల కార్యాచరణ దినాలను మినహాయించాలని ఎస్టీయు సంఘం తరుపున డిమాండ్ చేస్తున్నమన్నారు. అలాగే ఎస్టీయు నంద్యాల జిల్లా శాఖ ఉపాధ్యాయులకు చేస్తున్న పలు కార్యక్రమాలు నచ్చిన పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు మురళీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.అజాంబేగ్ ఆధ్వర్యంలో ఎస్టీయు సంఘం చేరి సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అమీర్, వెంకటేశ్వరరెడ్డి, గోపాలకృష్ణుడు, మహబూబ్ బాషా, లతీఫ్, బనగానపల్లె మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, మదనగోపాల్, నాగరాజు, బండి ఆత్మకూరు మండల బాధ్యులు రంగస్వామి, బేతంచెర్ల మండల అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ గాదిలింగేశ్వరస్వామి.. పూల రథోత్సవం

- భక్తిశ్రద్ధలతో గాదిలింగేశ్వరస్వామి వారికి పూజలు - పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం



**హాలహర్వి, డిశంబర్19, ప్రభాతవార్త;** మండలంలోని గూళ్యం గ్రామంలో గురువారం శ్రీ గాదిలింగేశ్వరస్వామి పూల రథోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ఆకుపూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం, గంగపూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు, నందికోలు ప్రదర్శన, కోలాట తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించి రథంపై ప్రతిష్టించారు. భక్తుల జైజై ధ్వనులతో స్వామివారి రథ చక్రాలు ముందుకు కదిలాయి. రథాన్ని ఎదురు బసవన్నగుడి వరకు లాగి అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తిరిగి రథాన్ని యదాస్థానానికి లాగారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూజారి మల్లన్న, డీపీ గాదిలింగప్ప మాట్లాడుతూ ప్రతియేటా కార్తీకమాసం స్వామివారి జీవిత చరిత్ర 21వ పురాణణ చదివి పురాణం ముగింపురోజున స్వామివారి పూల రథోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. రథోత్సవం ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వీరేశప్ప, మీసాలు పంపన్న, నీలాధర్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీకి బకాయి ఉన్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం..!

- పద్దతి మార్చుకోకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదు
- ఎమ్మెల్యే పార్థసారథికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ యాదవ్ సవాల్



**ఆదోని, డిసెంబరు 19, ప్రభాతవార్త** ఆదోని మున్సిపాలిటీకి తాను ఒక్కరూపాయి కూడా బకాయి లేదని తాను రూ. 2లక్షలు బకాయి ఉన్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించడం విడ్డూరంగా ఉందని తాను బకాయి ఉన్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మరి నిరూపించకపోతే ఎమ్మెల్యే కూడా తాను పెట్టే డిమాండ్లకు సిద్ధంగా ఉంటారా..అని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ యాదవ్ సవాల్ విసిరారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అసలు ఎలాంటి బకాయిలు లేదని నిరూపిస్తే రూ. 2లక్షలకు బదులు రూ. 4లక్షలు చెల్లిస్తానని లేకపోతే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఓటర్లకు డబ్బులు ఇచ్చి ఎమ్మెల్యే ఎన్నికల్లో విజయం సాధించారని నిజమైన విజయం తనదని తాను ఎలాంటి డబ్బు పంచకపోయినా భారీగా ఓట్లు వచ్చాయని డబ్బులు పంచకపోతే తనకు వచ్చిన ఓట్లు కూడా ఎమ్మెల్యేకు రావన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మున్సిపల్ కౌన్సిల్ హాల్‌ను బిజెపి కార్యాలయంలా మార్చారని బిజెపి నాయకులు, పోలీసులు లోపలికి రావడం ఏమిటని ప్రశ్నించారు. గత ఆరు నెలలకాలంలో ఎమ్మెల్యే ఆదోనికి చేసిందేమీ లేదని ఫండ్స్ తెచ్చింది కూడా ఏమీ లేదని కేవలం రోడ్లపై జీవించే వారిపై పోలీసుల ద్వారా ప్రతాపం చూపించి వారి కడుపు కొడుతున్నారన్నారు. ఎమ్మెల్యే ముందుగా ఆదోని అభివృద్ధిపై దృష్టి పెట్టి కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు తేవాలని ఇలా వేధింపులు చేయడం మానుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దిలీప్‌దోక మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ యాదవ్ బకాయి ఉన్నాడని ఎమ్మెల్యే ఆరోపించడం తగదని అసలు ఆధారాలు ఉంటే చూపించాలని బకాయి ఉన్న వాళ్ల కాలర్లు పట్టుకోవాలని ప్రజలను రెచ్చగొట్టడం తగదన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఆదోని ప్రజలు ఎంతో విశ్వాసంతో ఓటు వేసి గెలిపించారని ప్రజల విశ్వాసాన్ని కోల్పోవద్దని ఎమ్మెల్యేకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు, యువజన అధ్యక్షుడు దేవిశెట్టి వీరేష్, విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనిత్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్త మృతితో పార్టీకి తీరనిలోటు

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



**కర్నూలు అర్బన్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** కల్లూరు మండలం రేమదూరు గ్రామంలో వైసీపీ కార్యకర్త ఆర్ వెంకటేశ్వర్లు అనారోగ్యంతో చనిపోయిన విషయం తెలుసుకున్న నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి రేమదూరు గ్రామానికి చేరుకొని మృతుని కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థికసాయం అందించారు. ఆర్ వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా ఉంటామని తెలుపుతూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నారాయణరెడ్డి, పుసులూరు రామకృష్ణారెడ్డి, రేమదూరు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ వ్యవహార శైలి బాగలేదు

: కేవలం షో రాజకీయం కోసం కాంగ్రెస్ ఆరాటం-యంపి బైరెడ్డి శబరి

**నంద్యాల, డిశంబరు 19, ప్రభాతవార్త ప్రతినిది** డిల్లీలో పార్లమెంటు అవరణలో గురువారము కాంగ్రెస బిజెపి యంపిలు పోటా పోటీగా నిరసనలు చేపట్టగా ఈ పోటీ పోటీలో ఇద్దరు బిజెపి యంపిలకు గాయాలు కాగా నంద్యాల యంపి బైరెడ్డి శబరి ప్రథమ చికిత్స అక్కడే చేస్తు కాంగ్రెస్ యంపిలపై విరుచుకు పడ్డారు. పార్లమెంటు అవరణలో కాంగ్రెస్ బిజెపి యంపిలు నిరసనలు చేస్తున్న సమయంలో బిజెపి యంపిలే గాయపడ్డారు. దీనితో పార్లమెంటులో ఉన్న మన నంద్యాల యంపి బైరెడ్డి శబరి వారికి ప్రదమ చికిత్స చేశారు. ఈసందర్బముగా శబరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులు సరికాదని కేవలము షో కోసం పార్లమెంటు అవరణలో కాంగ్రెస్ నిరసన చేసిందని అమె అరోపిపించారు. కాంగ్రెస్ వ్యవ హారశైలిని అందరూ గమనిస్తున్నారని ఇలాంటి రాజకీయాలు సరికాదన్నారు. బారత రాజ్యాంగ నిర్మాత డాక్టరు బిఆర్. అంబేద్కరును బుదవారము లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమాన పరిచే విదముగా మాట్లాడాడని కేంద్రహోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండు చేస్తు కాంగ్రెస్ యంపిలు పార్లమెంటు అవరణలో గురువారము నిరసన ర్యాలీ చేట్టారని చెప్పారు. కాంగ్రెస్ యంపిలు నిరసన ర్యాలీకి వ్యతిరేఖముగా బిజెపి యంపిలు కూడా పార్లమెంటు అవరణలో నిరసన ర్యాలీ చేశారని చెప్పారు. పోటా పోటీగా నిరసన ర్యాలీలో ఇద్దరు బిజెపి యంపిలకు గాయాలు తగిలాయిని చెప్పారు. బిజెపి యంపి ప్రతాప్‌సారంగీ తలకు బలమైన గాయం మరోక యంపి ముఖేష్‌రాజ్‌పుత్‌కు కూడా గాయాలు కావడముతో వారికి వెంటనే తాను స్పందించి ప్రదమ చికిత్స అందించానని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం యంపిలను అసుపత్రికి తరలించామని చెప్పారు.



# ఆలూరులో వీధి కుక్కలకు వింత వ్యాధి

- భయాందోళనలో గ్రామస్తులు



**ఆలూరు రూరల్, డిసెంబర్19, ప్రభాతవార్త:** ఆలూరు మండల కేంద్రంలోని వీధి కుక్కలకు వింత వ్యాధి సోకడం వల్ల ప్రజలు భయాందోళనలతో వణికిపోతున్నారు. అదే విధంగా పాఠశాలలో మరియు జనసంచారం ఉండే ప్రాంతాల్లో అవి తిరుగుతుండడంతో విద్యార్థులకు మరియు ప్రజలకు అలర్జీ, గజ్జి వంటి వ్యాధులు సోకి ఆసుపత్రిపాలయ్యామని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలూ ఆరోపిస్తున్నారు. ఈమధ్య కాలంలో ఆలూరులోని ప్రధాన రహదారి అయినటువంటి అరికెర, సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాల ముందు గల పాఠశాలల సమీపంలో చికెన్, మటన్ వ్యర్థాలను పారవేస్తుండడంతో వాటి కోసం కుక్కలు ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాయి. వాటికున్న వింత వ్యాధి విద్యార్థులకు, ప్రజలకు ఎక్కడ సోకుతోందనని భయాందోళనకు గురవుతున్నారు. దీని పై గ్రామ పంచాయతీ అధికారులుకాని, పశువైద్యులుగాని దృష్టిసారించక పోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యాధి బారిన పడిన కుక్కలను గుర్తించి వాటికి సరైన వైద్యం అందించి వాటిని కట్టడి చేయాలని ఆలూరు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# అబివృద్ధికి నిర్వచనం తెలుగుదేశం ప్రభుత్వం

: అడిగిన 24గంటలోనే వెలసిన రోడ్డు




**నంద్యాల, డిశంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి** ప్రజా సమస్యలను పరిష్కరించడముతో తెలుగు దేశం ప్రభుత్వం తరువాతనే ఏ ప్రభుత్వాలైన ఏన్నో ఏళ్ల నుండి కనీసము రోడ్డుకు నోచుకోక నిత్యము మురికి, బురద మయంగా ఉండే వీదిలో అడిగిన 24గంటలో రెడ్ గ్రావెల్ రోడ్డు వెలసిందని అందుకు 38వార్డు ప్రజలు అనందోత్సవాలు ఉన్న వైనము నంద్యాల మున్సుపాల్టిలోని 38వార్డులో చోటు చేసుకుంది. పూర్తి వివరాలోకి వెళ్లితే నంద్యాల మున్సుపాల్టిలో ఉన్న 38వ వార్డులో ఎన్నో సంవత్సరాల నుండి అ వార్డు ప్రజలు నిత్యము మెరికి నీరు, వర్షము వస్తే బురదలో నడువాల్సిన దుస్తితి ఉండేది. అయితే ఇటీవల సెమీ క్రిష్టమస్‌ను పురస్కరించుకుని తెలుగు దేశం పార్టి ప్రదానకార్యదర్శి మంత్రి ఫరూక్ కుమారుడు 38వ వార్డుకు రావడము జరిగింది. దీనితో వార్డులో ఉన్న చిన్న పెద్ద, స్త్రీలు, పురుషులు తమ గోడకు ఫరోజ్‌కు వినిపించారు. దీనితో అక్కడే ఉన్న వార్డు ఇంచార్జి బగ్గరాముడుకు ఫిరోజ్ అదేశాలు జారీ చేయడముతో కేవములము 24గంటలలో 38వార్డులోని మురికి నీటి స్థానములో రెడ్ గ్రావెల్ రోడ్డు దర్శణము ఇవ్వడము అవార్డు ప్రజల అనందమునకు అవదులు లేదవని చెప్పారు. ఈసందర్బముగా మంత్రి కుమారుడు యన్‌యండి పిరోజ్‌కు, బుగ్గరాముడుకు కృతజ్ఞతలు తెలిపారు.

# మిరపసాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

: ఉద్యావనశాఖ అసిస్టేంట్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ధనుంజయ్య
: కరివేనలో మిరప రైతులకు అవగాహన
: ఆత్మకూరు మండల ఉద్యావనశాఖ అధికారిణి చందన ఆధ్వర్యంలో కార్యక్రమం



**ఆత్మకూరు, డిసెంబర్19, ప్రభాతవార్త:** ఉద్యావనశాఖ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు మండలంలో మిరప సాగు రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఉద్యావనశాఖ అసిస్టేంట్ ప్రాజెక్టు ఐటిడిఏ డైరెక్టర్ అధికారి ధనుంజయ్య, మండల వ్యవసాయశాఖ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు ఉద్యావనశాఖ అధికారిణి చందన తెలిపారు. గురువారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో మిరప పంట సాగులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా అధికారులు మాట్లాడుతూ మిరప సాగులో బ్లాక్ త్రిప్స్ ఉధృతి పెరగకుండా వేపనూనెతో ముందస్తుగా పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఐటిడిఏ ప్రాజెక్టు క్రింద వివిద రకాల పథకాలు రైతులకు 100శాతం సబ్సీడి క్రింద అమలు చేసే విదంగా ఉన్నాయని గుర్తు చేశారు. ఉద్యవనశాఖ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు, పగిద్యాల తదితర ప్రాంతాలలో చెంచు రైతులకు పథకాల కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని తెలియజేశారు. గిరిజన రైతులకు అన్ని విదాలుగా సబ్సీడి అందించి వారి అభివృద్ది కోసం ఐటిడిఏ అధికారులు కృషి చేస్తామని వివరించారు. బిఏఐఏఫ్ ఎన్‌జిఓ యాజమాన్యం, ఎంపిఈఓ, రైతులు, తదితరులు పాల్గోన్నారు.

# జిల్లా జడ్జిని కలిసిన బనగానపల్లె న్యాయవాదులు



**బనగానపల్లె, డిసెంబర్19, ప్రభాతవార్త:** గత కొంత కాలంగా బనగానపల్లె కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రానున్న కాలంలో మరింత ఇబ్బంది మారుతోందన్న ఉద్దేశ్యంతో బనగానపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఖాజా హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన న్యాయమూర్తి ఈనెల 28వ తేదిన కోర్టు భవనాన్ని పరిశీలించి నూతన భవనం మంజూరుకై ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరలో భవనం మంజూరుకు కృషి చేస్తానని వివరించారు. కాగా ఇటీవల వర్షాకాలంలో చాంబర్ మరియు కోర్టు హాల్ నందు వర్షపు నీరు లీకై తీవ్ర ఇబ్బందికి గురయ్యామని న్యాయవాదులు తెలపడంతో స్పందించిన న్యాయమూర్తి అక్కడి పరిస్థితులను పూర్తిగా పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలన్నింటిని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఖాజా హుస్సేన్, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసమూర్తి, ఎం.రఘురాంరెడ్డి, జాకీర్ హుస్సేన్, అల్లావుద్దీన్, ఇర్ఫాన్, అబ్బాస్, రఫితోపాటు అన్ను పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తా

: మండల అభివృద్ధి అధికారి కే.వి.సుబ్రమణ్యం
: బైర్లూటి, నాగులూటి చెంచు గూడెలలో పర్యటన
: నిర్లక్ష్యం చేస్తే అధికారులపై చర్యలు తీసుకోక తప్పదు



**ఆత్మకూరు, డిసెంబర్19, ప్రభాతవార్త:** నల్లమల అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న చెంచు గిరిజనుల అభివృద్ధికి అన్ని విదాలుగా ముందుంటామని ఆత్మకూరు మండల అభివృద్ధి అధికారి కేవి.సుబ్రమణ్యం, ఐటిడిఏ ఎన్‌ఆర్‌ఈజిఎస్ ఎపిఓ నాగార్జున పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బైర్లూటి చెంచు గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందించే పౌష్టికాహారంను పరిశీలన చేశారు. అనంతరం నాగులూటి చెంచు గూడెంలో రైతులు సాగు చేసుకుంటున్న మామిడి, మినుము పంట సాగులను పర్యవేక్షణ చేశారు. ఈ సందర్బంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులు సాగు చేసుకుంటున్న చెంచు గిరిజనులకు అన్ని విదాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ముఖ్యంగా గిరిజనులు తమ పొలాలో సాగు చేసుకుంటున్న మామిడి మొక్కలతో పాటు నన్నారి, నర్సరిని పరిశీలన చేయడం జరిగిందని అన్నారు. గిరిజనులకు ఆదార్ కార్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం దృష్టిలో ఉంచుకోని బైర్లూటి చెంచు గూడెంలో ఆదార్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెంచు గిరిజనులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విదంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులకు చేరవేసే విదంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందని అన్నారు. ముఖ్యంగా గిరిజన గూడెలలో చెంచులకు పండ్ల తోటల పెంపకం వేసుకోని వారి అభివృద్దికి ముందుంటామన్నారు.



# ఉచితం మాటున ఇసుక దోపిడి

- అడ్డుకున్న గంజహళ్లి పంచాయతీ కార్యదర్శి, పోలీసులు
- గాజులదిన్నె ప్రాజెక్టు భూమి తనదే నంటు అక్రమం వసూళ్లు




**గోనెగండ్ల డిసెంబరు 19 ప్రభాతవార్త** సామాన్యులకు, గృహాలు నిర్మించుకునే పేదలకు ఇసుక అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశ పెట్టింది. దీన్ని అసరగా తీసుకొని కొందరు అక్రమార్కులు గంజహళ్లి దగ్గర ఉన్న హంద్రీనదిని తోడుస్తున్నారు. ఆదోని, అరెకల్లు, బిల్లేకల్లు, దేవిబెట్ట, ఎమ్మిగనూరు, గోనెగండ్ల ప్రాంతాల వారు యదేచ్చగా ఇసుకను తరలిస్తున్న సోమ్ముచేసుకుంటున్నారు. దీంతో గంజహళ్లి గ్రామ రైతులు తమ పొలాలకు వెళ్లే దారులు దెబ్బతింటున్నాయని బోరుమంటున్నారు. అలాగే స్వంతపనులకు కాకుండా ఇసుకను వ్యాపారం చేస్తున్న 50ట్రాక్టర్‌లు ఇసుక కోసం గురువారం గంజహళ్లి హంద్రీనది వచ్చాయి. దీంతో గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పోలీసులు ఇసుకను తోడే హంద్రీనది లోకి వెళ్లి ఇసుకను లోడ్ చేసుకుంటున్న ట్రాక్టర్‌ల దగ్గరకు వెళ్లి వెనక్కి పంపారు. గాజులదిన్నె ప్రాజెక్టులోకి మునక పోయిన భూమి (ప్రభుత్వ భూమి సర్వేనెం 282/13బీ, 15.12 ఎకరాలుతో పాటు మరి కొన్ని సర్వే నెంబర్లలోని భూమి) తమదే నని కొందరు వ్యక్తులు ట్రిప్పు ట్రాక్టర్‌కు రూ. 500 వసూళ్లు చేస్తున్నాడనే ఆరోపణ ఉంది. అలాగే చోటా మోటా నాయకుల చేతివాటానికి అడ్డులేకుండా పోయింది. గంజహళ్లి నుంచి అక్రమంగా ప్రతి రోజు 100 ట్రిప్పులకు పైగానే ఇసుకను తరలిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విథంగా హంద్రీనదిలోని ఇసుకను తరలించి వ్యాపారం చేసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ట్రాక్టర్ ఆటో ఢీ ముగ్గురికి గాయాలు

**కొత్తపల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** ట్రాక్టర్ ఆటో ఎదురేదురుగా ఢీకొని ముగ్గురికి గాయాలు అయిన సంఘటన మండలంలోని దుద్యాల శుద్దవాగు సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు పట్టణం నుంచి 8 మంది ప్రయాణికులతో ఆటో కొక్కెరంచ గ్రామానికి వెళ్తుండగా దుద్యాల శుద్దవాగు సమీపంలో ఆదేసమంలో ఎదురుపాడు నుండి కట్టెల లోడు వేసుకొని వెంకటాపురం వెళ్తున్న ట్రాక్టరు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటలో ఉన్న నాగలక్ష్మమ్మ, రంగస్వామి, నారాయణమ్మలకు గాయాలు అయ్యాయి. వారిని వెంటనే ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కేశవ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



# పెట్రోలు బంకుల ఏర్పాటుకు స్థల పరిశీలన

**కోవెలకుంట్ల, డిశంబరు 19, ప్రభాతవార్త** కోవెలకుంట్ల మండలంలోని రెండు గ్రామాల శివారుల్లో పెట్రోలు బంకులు మంజూరు కావడముతో నంద్యాల జాయింట్ కలెక్టరు విష్ణుచరణ్ గురువారము స్థలాలను చెక్ చేశారు అందులో బాగంగా కోవెలకుంట్ల మండలంలోని అమడాలగ్రామం వద్ద రైల్వే వంతెన దాటిని పిదప ఉన్న స్థలాన్ని చెక్ చేశారు అలాగే మండల పరిదిలోని గుల్లదుర్తి గ్రామము దాటిన పిదప ఉన్న స్థలాన్ని జేసి చెక్ చేశారు ఈయన వెంట తహాశీలుదారు ప్రవీన్‌కుమారరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రియుడిపై దాడి కేసులో అరెస్టు అయిన ముద్దాయిలు

- ప్రియురాలుతో సహా నాలుగురు అరెస్టు



**గోనెగండ్ల డిసెంబరు 19 ప్రభాతవార్త** మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు ఎల్లెల్సీ కాలువ దగ్గర ఎమ్మిగనూరు చెందిన వడ్డే అరవిందస్వామి పై జరిగిన హత్యయత్నం కేసులో ముద్దాయిలు గురువారం అరెస్టు చేశారు. ఈ సందర్బంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ 17 వతేదిన జరిగిన హత్యాయత్నం కేసులో ముద్దాయిలను అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. పోలీసులు అందించిన సయాచారం మేరకు ఎమ్మిగనూరు మండలం దేవిబెట్ట గ్రామానికి చెందిన ఈడిగ భరత్ (21)అతని ప్రియురాలు బుట్ట ప్రియాంక అలగే తన స్నేహితులు దేవిబెట్ట గ్రామానికి చెందిన వడ్ల కుమారస్వామి (20), గంధాల ప్రశాంత్ కుమార్(20), కోడుమూరు గ్రామానికి చెందిన ఎరుకుల రామాంజి నేయులు(20) ఐదుగురుని గోనెగండ్ల మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామ సమీపంలోని మాల్లెలవాగు వంక వద్ద గురువారం సాయంత్రం 6.30గంటలకు అరెస్టు చేసి, వారి నుంచి నేరమునకు ఉపయోగించిన ఒక బజాజ్ పల్సర్ మోటార్ సైకిలును, హోండా అక్టివా ద్విచక్ర వాహనాన్ని, ఐదు సెల్ ఫోన్లను, నేరానికి ఉపయోగించిన వేట కొడవళ్లను స్వాదీనము చేసుకున్నాట్లు తెలిపారు. గతంలో ముద్దాయి ఈడిగా భరత్ ప్రియురాలికి అలాగే గాయపడిన ఫిర్యాదు వడ్డే అరవిందస్వామికి ప్రేమ వ్యవహారము కొంత కాలముగా సాగిందని, అ తర్వాత వారు విడిపోయి కొంత కాలంగా దూరంగా ఉంటున్నారని. అయితే గత మూడు నెలలుగా తిరిగి మళ్లీ వడ్డే అరవిందస్వామికి భరత్ ప్రియురాలు వెంట పడుతుండగా, భరత్ ప్రియురాలు వారి స్నేహితులు వడ్లకుమారస్వామి, గంధాల ప్రశాంత్‌కుమార్, ఎరుకుల రామాంజినేయులు కలిసి వడ్డే అరవిందస్వామిని చంపాలనే ఉద్దేశము తో వెటకొడవళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఐదుగురు ముద్దాయిలని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.